క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాజాం సిటీ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక య్యారని హెచ్ఎం గురుమూర్తి మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో పదోతరగతి విద్యార్థులు జినగం జస్వంత్, దాసరి భాస్కరరావు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను హెచ్ఎం తో పాటు పీఈటీ అజయ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసనకు సంఘీభావం



నిరసన తెలుపుతున్న సంతకవిటి పీహెచ్‌సీ సిబ్బంది

సంతకవిటి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీల వైద్యులు కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్నారు. వీరికి సంఘీభావం తెలుపుతూ సంతకవిటి పీహెచ్ సీలో సిబ్బంది మంగళవారం నల్ల రిబ్బన్‌లు ధరించి విధులకు హాజరయ్యారు. కాసేపు పీహెచ్‌సీ ముందు నిరసన తెలిపారు. పీహెచ్‌సీల వైద్యులకు న్యాయం చేయాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ప్రతి ఒక్కరూ కార్డియో పల్మనరీ రెసిపిటేషన్(సీపీఆర్)పై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు ఖండ్యాం గ్రామంలో ప్రజలకు సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించా రు. ఎవరైన అకస్మాత్తుగా గుండె పోటుతో కుప్పకూలిపోతే తక్షణమే సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. సీపీఆర్ చేయడం ద్వారా గుండె పోటు మరణాలను అదుపు చేయ వచ్చని చెప్పారు. సీపీఆర్ చేయడం ద్వారా గుండెకు రక్త ప్రసరణ సాఫీగా జరుగు తుందని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడితే నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చన్నారు.

లింగనిర్ధారణ నేరం



మాట్లాడుతున్న ఆర్డీఓ రామమోహనరావు

బొబ్బిలి: మూఢ నమ్మకాలు, ఆడపిల్లల పట్ల వివక్షతో లింగనిర్ధారణ చేయడం నేరమని ఆర్డీఓ జె.వి.వి.ఎస్.రామమోహనరావు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు కోసం వివిధ శాఖాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పురుష సంతాన ప్రాధాన్యత ఉందన్న ఆలోచనతో ఎవరైనా ఇటువంటి ఆలోచనలకు, సంఘటనలకు పాల్పడితే వారు చట్టరీత్యా శిక్షార్హులన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.సంతోషి కుమారి, చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ సంధ్య,ఏఎస్ఐ బి.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



లచ్చయ్యపేటలో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చయ్యపేట, ఆదర్శనగర్, అమ్మవారికాలనీ, డోలపేట, మల్లికార్జునకాలనీలో దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ ఫాగింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణకు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నామని చెప్పారు. ప్రజలు నివాస పరిసరాల్లో చెత్త నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

చిక్కుడు సాగుతో సిరులు



రామభద్రపురంలో సాగులో ఉన్న పొడుగు చిక్కుడు పంట

- బొబ్బిలి నియోజకవర్గంలో విస్తృతంగా సాగు
- తక్కువ నీటి వనరులు, తక్కువ పెట్టుబడితో అధికదిగుబడి
- మంచి ధర ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



రామభద్రపురంలో వరి చేను గట్టుపై సాగులో ఉన్న చిక్కుడు



రామభద్రపురంలోని అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో చిక్కుడు కాయలు విక్రయిస్తున్న రైతులు

రామభద్రపురం: ఖరీఫ్ సీజన్‌లో వేసిన పొడుగు చిక్కుడు పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండ లాల రైతులు వందలాది ఎకరాల పల్లం,మెట్టు భూముల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఆరుతడి పంటల పై దృష్టి సారించారు. సాగునీటి బోరుబావులు,నేల బావులున్న చోట ఎక్కువగా చిక్కుడు పంట వేశారు. తక్కువ నీటి తడులు, తక్కువ పెట్టుబడితో పంట చేతికి వస్తుం డడం వల్ల ఈపంటపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. రామభద్రపురం మండలంలో తారాపురం,ఆరికతోట, రామభద్రపురం, నాయుడువలస, బూసాయవలస, కొత్తరేగ, పాతరేగ, దుప్పలపూడి,మామిడివలస, ముచ్చర్ల వలస, బాడంగి మండలంలోని కామన్నవలస,కోడూరు, గజరాయనవలస, ముగడ, గొల్లాది, రామచంద్రపురం, బొబ్బిలి మండలంలోని గొర్లెసీతారాంపురం, మెట్టవలస, గొల్లపల్లి, పాతబొబ్బిలి తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో చిక్కుడు సాగులో ఉంది. చిక్కుడులో అంతర పంటలుగా కాలీఫ్లవర్, క్యాబేజీ,బెండ,వంగ,ఉల్లి,బంతి,మిరప వంటి పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు.కొంత మంది రైతులు వరి చేల గట్లపై, పత్తి పంట చుట్టూ వేస్తున్నారు. ఈఏడాది పంటను పెద్దగా తెగుళ్లు ఆశించకపోవడంతో దిగుబడులు బాగున్నాయని, మార్కెట్‌లో కిలో చిక్కుడు కాయల ధర రూ.30 నుంచి రూ.35 పలుకు తుండడంతో లాభదాయకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో చిక్కుడు సాగుకు రూ.15 వేల వరకు పెట్టుబడి అయితే దాదాపు రూ.35 వేల నుచి రూ.40వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. రామభద్రపురం మండలంలో ఉద్యానవన శాఖాధికారుల సలహాలు సూచనలతో ఈ పంటను ఆధునిక పద్ధతిలో పందిర్లు వేసి పండిస్తున్నారు.రామభద్రపురంలో అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉండడంతో రైతులు ఇక్కడికి పంటను తరలించి విక్రయిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, రావులపాలెం ,రాజమండ్రి ప్రాంతాలకు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలైన ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, చత్తీస్ ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుండడంతో అమ్మకాలు బాగున్నాయని రైతులు అంటున్నారు.

ధర నిలబడితే మంచి ఆదాయం



వరి చేను గట్టుపై పొడుగు చిక్కుడు వేశాను.వరి పంట చేతికి వచ్చినంత వరకు ఈపంట ద్వారా కొంత ఆదాయం పొందుతున్నాం. ప్రస్తుతం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ధర పలుకుతోంది.పంట పూర్తి అయినంత వరకు ఈధర నిలబడితూ మంచి ఆదాయమే వస్తుంది. – చుక్క రామారావు, కూరగాయల రైతు, రామభద్రపురం

ఆధునిక పద్ధతులు పాటించాలి



కూరగాయల పంటల సాగులో రైతులు ఉద్యానవనశాఖాధికారుల సలహాలు,సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చు. తీగ జాతి పంటలను మల్చింగ్ పద్ధతిలో సాగు చేసుకుంటే పెట్టుబడి తగ్గుతుంది. సీజన్ బట్టి డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తే ఇంకా మంచి ఆదాయం పొందవచ్చు. – మోహనకృష్ణ, ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం.

కల్తీ నెయ్యి మకిలీపై సుప్రీం తీర్పు చెంప పెట్టు

- నకిలీ మద్యం వ్యవహారాన్ని ఇతరులపై నెట్టేందుకు చంద్రబాబు తీవ్ర ప్రయత్నాలు
- నకిలీ మద్యం తయారీకి సంబంధించి టీడీపీ వారే సూత్రధారులు, పాత్రధారులు
- పరిపాలనకు చంద్రబాబు అనర్హుడు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా తిరుమల తిరుపతిలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారని, దీనిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించేందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు చేసిన కుట్ర ప్రయత్నాలు బెడిసి కొట్టాయని, దీనికి తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కల్తీ నెయ్యి మకిలీని వైఎస్సార్‌సీపీకి అంటించబోయిన కూటమి నాయకులు తమ టీడీపీ నాయకులపై బట్టబయలైన నకిలీ మద్యం కేసును వైఎస్సార్‌సీపీకి ఆపాదించేందుకు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన పాపాన్ని, వైఫల్యాల ను ఇతరులపై నెట్టి వేసేందుకు చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని విమర్శించారు. ముమ్మాటికీ నకిలీ మద్యం రాకెట్ టీడీపీ నాయకులదేనని అన్నారు.కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయనీ, తిరుమలలో కల్తీ నెయ్యి అంటూ ఆరోపణలు చేయడం మానండని ఎంతో మంది అరచి గీపెట్టినా పదే పదే అవే విమర్శలు, ఆరోపణలు చేసిన కూటమి నాయకుల నోళ్లు చివరకు తాజాగా సుప్రీం తీర్పుతో మూతపడ్డాయన్నారు.

చంద్రబాబు రాజీనామా చేయాలి

నకిలీ మద్యం తయారీ రాష్ట్రంలో కుటీర పరిశ్రమలా మారిందని, దీనికి అధికార పార్టీ నాయకులే సూత్రధారులు, పాత్రధారులని తేలిందని శంబంగి అన్నారు. నకిలీ మద్యం అంశంపై కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తున్నందుకు, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళుతుండడంతో ఆనేరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేసేందుకు చంద్రబాబు మార్కు రాజకీయం మళ్లీ తెరపైకి వచ్చిందన్నారు. వీటన్నింటికీ నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్న చంద్రబాబు పరిపాలనకు అనర్హుడన్నారు. ఈకుట్రలన్నీ ప్రజలంతా చూస్తున్నారనీ, ఎవరు ఎంతపాటి అక్రమా ర్కులో వారికి తెలుసన్నారు. నకిలీ మద్యం నేరాన్ని ఇతరులపైకి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని,కల్తీ నెయ్యి అంశంపై తీర్పులాగే దీనిపైనా స్పష్టమైన తీర్పులు మళ్లీ వస్తాయని, అంతవరకూ కూటమి నాయకులు ఓపిక మీద ఉండాలన్నారు. నకిలీ మద్యం గుట్టు రట్టయిన తీరు అందరికీ తెల్సిందేననీ, లైసెన్స్ ఉన్న కంపెనీని తలపించేలా నకిలీ మద్యం పరిశ్రమను టీడీపీ నాయకులు నడిపించారని, వీరి ధన దాహానికి పేద ప్రజల ప్రాణాలు కూడా లెక్కలేదన్నారు. మద్యం దుకాణాల కేటాయింపు, ఇప్పుడు పర్మిట్ రూంల మంజూరు వెనుక పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందన్నారు. ఎక్సైజ్ అధికారులు చొరవ చూపి కేసులు నమోదు చేసి అక్రమార్కులను జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి. మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి పట్టణ ఉపాధ్యక్షుడు దమ్మా అప్పచ్చి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన కలెక్టర్



బాడంగి: కేజీబీవీ ఎస్ఓతో మాట్లాడుతున్న కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి



బాడంగి: ట్యాప్ వాటర్‌ను పరీక్షిస్తున్న కలెక్టర్

బాడంగి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. తరగతిగదుల్లో కొంతమంది విద్యార్థినులు నేల కూర్చొని ఎఫ్ఏ-2 పరీక్షలు రాస్తుండడాన్ని గమనించారు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడా ఫర్నీచర్ లేదా అని కేజీబీవీ ఎస్ఓ (స్పెషల్ ఆఫీసర్) జి.హరితను కలెక్టర్ ప్రశ్నించగా, అన్ని తరగతులకూ ఫర్నీచర్ రాలేదని ఆమె బదులిచ్చారు. ఆర్ఓ ప్లాంట్ పని చేస్తుందా అని అడిగి, అక్కడి కుళాయిల వద్ద తాగునీటిని తాగి పరీక్షించారు. కిచెన్ రూమ్‌ను పరిశీలించి, మెనూ ప్రకారం, రుచికరంగా వంటలు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యాలయం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాల గురించి ఎస్ఓను ఆరా తీశారు. నూతన భవనాల్లో ఓ వైపు గదులను డార్మెంటరీ కోసం, మరో వైపు గదులను ల్యాబ్ కోసం నిర్మిస్తున్నట్టు ఆమె చెప్పారు. కలెక్టర్ వెంట డీఈఓ యు.మాణిక్యాలనాయు డు, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. రామభద్రపురం మండలం ఆరికతోట ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. గ్యాస్ పొయ్యిలపై వంట చేయాలని ఉన్నత పాఠశాల వంట నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో ఆర్వోప్లాంట్ పనిచేయకపోవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యంనాయుడు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు కృష్ణవేణి, పార్వతి పాల్గొన్నారు.

16న హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా వచ్చిన ఆదాయం, కానుక లను ఈనెల 16న లెక్కించనున్నామని ఆలయ ఈఓ పి.శ్యామలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో హుండీలు తెరవనున్నామని పేర్కొన్నారు. అలాగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ మాలధారణ చేసిన భక్తులు సమర్పించిన ఇరుముడులకు సంబంధించిన ఆదాయాన్ని కూడా లెక్కించనున్నామని స్పష్టం చేశా రు.భక్తులు పాల్గొనాలని కోరారు.

మగ్గూరులో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న హరే కృష్ణ భక్తజన సంఘం

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన హరే కృష్ణ భక్తజన సంఘం ఆధ్వర్యంలో మగ్గూరు గ్రామంలో మంగళవారం నగర సంకీర్తన చేశారు. వేకువ జామున హరే కృష్ణ భక్తజన సంఘ సభ్యులు, స్థానిక భక్తులతో కలిసి భక్తి గీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరుగుతూ ప్రజలను మేలుకొలిపారు.

తహసీల్దార్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖరం

రాజాం: కొత్తూరు మండల తహసీల్దార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని రాజాం తహసీల్దార్ ఎం.రాజశేఖరంతో పాటు కార్యాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. దళిత తహసీల్దార్‌పై తప్పుడు ఆరోపణలు చేయ డంతో పాటు దాడికి పాల్పడడం అమానుషమని అన్నారు. దోషులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు.

బాధ్యతా రాహిత్యంతో విధులు నిర్వర్తిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్...



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-6లో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ విమలారాణి, తదితరులు

రామభద్రపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ విమలారాణి హెచ్చరించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరిపడా పౌష్టికాహార సరుకులు పంపిణీ కావడం లేదన్న అంశంపై ఈనెల 14వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంగన్‌వాడీ కేంద్రాలకు అరకొర సరుకులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈకథనానికి జేసీ స్పందించారు.పౌష్టికాహార సరుకులు పూర్తిస్థాయిలో సరఫరా కాని కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఐసీడీఎస్ పీడీ విమలారాణితో పాటు బొబ్బిలి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి సూర్యప్రకాష్‌లకు జేసీ ఆదేశించారు. దీంతో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు-2,4,6,8లలో ఐసీడీఎస్ పీడీ, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి తనిఖీలు చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను బాలసంజీవిని యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పౌష్టికాహార సరుకులు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు.

ప్రతీ నెల 9,10 తేదీల లోపు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని, 10వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన వారికి ఆనెలలో సరుకులు రావని చెప్పారు. అలాగే గత నెలలో వచ్చిన సరుకులు వినియోగించగా మిగిలిన సరుకులు ఓబీ(ఓవర్ బ్యాలెన్స్) చూపిస్తూ యాప్‌లో నమోదు చేయాలని, కానీ ఈ కేంద్రాల్లో కార్యకర్తలు అలా చేయలేదన్నారు. సరుకులు అందని వారికి సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే డీలర్ వద్దకు సరుకుల కోసం వెళ్లేటప్పుడు వారు ఇచ్చిన సరుకులను పరిశీలించాలని,కాలపరిమితి తక్కువగా ఉన్న వాటిని తీసుకోకుండా వదిలేయాలని చెప్పారు. బాడంగి,భోగాపురం సీడీపీఓలు వరహాలమ్మ,లావణ్య, సూపర్‌వైజర్లు సూర్యకుమారి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకూ రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికర భోజనం అందించేలా పర్యవేక్షణ చేయాలని హెచ్ఎం శాసపు శ్రీనివాసరావుకు సూచించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలని చెప్పారు. ఎంఈఓ వెంట ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు పోషణపై జాగ్రత్తలు తీసుకోవాలి



పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేస్తున్న డీఎల్‌డీఏ సత్యప్రకాష్

రేగిడి: పశు పోషణపై పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రకాష్ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యులు 79 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స, సాధారణ వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యప్రకాష్ మాట్లాడుతూ చూడి పశువుల పోషణలో వైద్యుల సలహాలు తీసుకోవాలని చెప్పారు.వ్యాధుల బారినపడకుండా ఉండేం దుకు టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం పశువుల కోసం పాడి రైతులకు మినరల్ మిక్చ ర్ ప్యాకెట్లను అందజేశారు. పశుసంవర్ధక శాఖ రాజాం ఏడీఏ బి.జయప్రకాష్, పశువైద్యులు దుర్గా ప్రసాద్, రాము, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అప్పలనాయుడు, గౌరునా యుడు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగ



వంగర: వంగరలో బంగారమ్మతల్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు

సంతకవిటి: మండలంలోని ఎస్.అగ్రహారంలో గ్రామదేవత చెవిటిపోలమ్మ వారాల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సాయంత్రం ఘటాలు, ముర్రాటలతో ఊరేగింపుగా అమ్మవారి గద్దెకు వెళ్లి పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పులి వేషధారణల ప్రదర్శన ఆకట్టుకుంది.

వంగరలో..

వంగర: మండల కేంద్రం వంగరలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామదేవతలు దేశమ్మతల్లి, పోలపోలమ్మ, బంగారమ్మతల్లి వారాల పండగ మంగళవారంతో ముగిసింది. గ్రామస్తులు బంగారమ్మతల్లి ఆలయానికి ఊరేగిం పుగా వెళ్లి పసుపు, కుంకుమ, ముర్రాట లు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏఐ హబ్‌గా విశాఖ

బాడంగి: విశాఖపట్టణాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునా యుడు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో 87 వేల కోట్లరూపాయలతో గూగుల్ టెక్ కంపెనీ ఏఐ హబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదిరిందని చెప్పారు. విశాఖలో టెక్నాలజీ విప్లవం మొదలైందన్నారు. ఇప్పటికే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయగా ఇప్పుడు విశాఖలో గూగుల్‌టెక్ వంటి సంస్థలు పెట్టుబడి పెట్టడం వల్ల వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై విచారణ



మృతుడి భార్య అప్పలనర్సమ్మను విచారణ చేస్తున్న పోలీసులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో ప్రమాదవశాత్తు మంచంపై నుంచి పడి కర్రిరామారావు (61) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం రాత్రి మద్యం తాగి మంచంపై పడుకున్నాడని తెల్లవారి చూసేసరికి నేలపై పడి ఉన్నాడని, తలపై గాయమై రక్తస్రావం కావడంతో మృతి చెందాడని భార్య అప్పలనర్సమ్మ తెలిపింది. పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకునేలోగానే బంధువులు మృతదేహానికి దహన సంస్కారాలను పూర్తిచేశారు. దీంతో మృతుడి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు శంకర్రావును పోలీసులు విచారణ చేసి వివరాలు సేకరించారు. దీనిపై సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి విచారణ చేశామని, ఎవరూ ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదన్నారు.

వీఓఏలపై వేధింపులు ఆపాలి



ర్యాలీ చేస్తున్న వీఓఏలు

బాడంగి: గ్రామైక్య సంఘాల సేవకులుగా పనిచేస్తున్న వీఓఏలపై రాజకీయ నాయకుల పెత్తనం, వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కన్వీనర్ సురేష్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వీఓఏలు మంగళవారం ర్యాలీ చేశారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల ని, కనీస వేతనం ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 5జీ మొబైల్ ఫోన్‌లు ఇవ్వాలని కోరారు.